సాక్షి నల్లగొండ

మంగళవారం ၊ 10 ၊ సెప్టెంబర్ ၊ 2024



రూ.20 లక్షలు స్వాహా!
బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో భారీ కుంభకోణం బయటపడింది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,37,230 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 95,184 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,907 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,210 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 3,257 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 1,244 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

హైదరాబాద్‌లో ప్రజావాణి వాయిదా

నల్లగొండ : హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు నోడల్ అధికారి దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు నిర్వహించనున్నందున మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు

నకిరేకల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ సబ్ జూనియర్స్ బాలుర జట్టును సోమవారం నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఎంపిక చేశారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింత కాలయ పుల్లయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్టు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు వరంగల్ జిల్లా కేంద్రంలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో జరిగే 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కక్ర వీరారెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ఉస్మాన్, ఉపాధ్యాయులు లగిశెట్టి సత్యనారాయణ, రాజేందర్, పీఈటీలు చైతన్యకుమార్, కవిత, అంజి, రాజ్యలక్ష్మి, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ భద్రతలో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో పోలీసు, ప్లాంట్ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాంట్‌లో స్క్రాప్ చోరీకి గురవుతున్నా భద్రతను పటిష్టం చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రత వైఫల్యానికి కారణమైన వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత పాలనలో జరిగిన పొరపాట్లు తిరిగి జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, జెన్‌కో సీఈ సమ్మయ్య, సీఐ వీరబాబు, ఎస్‌ఐ ఇరుగు రవి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు విశేషరీతిలో చేపట్టారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గంగా హారతి



రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించే వల్లభరావు చెరువు వద్ద ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఎలాంటి ఆటంకాలు లేకుండా గణేశ్ నిమజ్జనం జరగాలని గంగా హారతి ఇచ్చారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

చెరువు వద్ద హారతి ఇస్తున్న ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు

సాదాబైనామాకు నిరీక్షణ

- పరిష్కారం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపు
- కొత్త ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తుందని దరఖాస్తుదారుల ఆశలు
- గతంలో వచ్చిన దరఖాస్తులు 28,314, వాటిలో పరిష్కరించినవి 14,234
- 14,080 దరఖాస్తులు పెండింగ్
- ప్రస్తుతం ఆ ఊసెత్తని ప్రభుత్వం



నల్లగొండ : సాదా బైనామాలకు నిరీక్షణ తప్పడం లేదు. సాదా కాగితాలు, స్టాంపు పేపర్లపై భూములు కొనుగోలు చేసిన వారు వాటిని సాగు చేసుకుంటున్నా.. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రైతుబంధు, బ్యాంకు రుణాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారానికి రెండు విడతలుగా దరఖాస్తులు స్వీకరించి కొన్నింటిని పరిష్కరించింది. కొత్తగా వచ్చిన ధరణితో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి ప్రక్షాళనకు పూనుకోవడంతో సాదాబైనామా దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. కానీ నెలలు గడుస్తున్నా ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాకపోవడంతో వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.


2016, 2020లో దరఖాస్తుల స్వీకరణ..

40, 50 ఏళ్ల క్రిత భూములు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన సందర్భంలో తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లపై రాసుకునే వారు. ఆ కాగితం ఉంటే అది కొనుగోలు చేసి వారి ఆస్తిగానే పరిగణనలోకి వచ్చేది. దాని ఆధారంగానే వారికి పట్టా కూడా చేసేవారు. చాలా మంది ఇలా తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లపై భూములు కొనుగోలు చేశారు. కానీ అప్పట్లో పాస్‌బుక్‌లు పొందలేదు. అలా కొన్న వారిలో కొందరు చనిపోవడందో.. ఆ సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014 జూన్ 2వ తేదీకి ముందు సాదాకాగితాలపై కొనుగోలు చేసిన భూములను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి 2016లో మొదటి విడత దరఖాస్తులను స్వీకరించింది. కానీ ఆ తర్వాత పట్టించుకోలేదు. మళ్లీ 2020లో రెండో విడత దరఖాస్తులకు అవకాశం ఇచ్చింది. కొందరికి పట్టాలు అందజేసింది. ఆ తర్వాత ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

జిల్లాలో 28,314 దరఖాస్తులు..

నల్లగొండ జిల్లాలో 2020లో సాదాబైనామాల రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తులను స్వీకరించగా నల్లగొండ జిల్లాలో 28,314 దరఖాస్తులు వచ్చాయి. అందులో 14,234 పరిష్కరించారు. ఇంకా 14,080 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ధరణి పోర్టల్‌లో సాదాబైనామాలను రెగ్యులరైజ్ చేసే సందర్భంలో ఆన్‌లైన్‌లో అమ్మినవారి పేర్లే వస్తుండటంతో.. వారు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్లు చేసే విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. దాంతో అప్పి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి ప్రక్షాళన చేస్తూ.. భూ సమస్యలు పరిష్కరించేందుకు కమిటీ వేసిన విషయం తెలిసిందే. అందులో సాదాబైనామాలు కూడా పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీంతో దరఖాస్తుదారుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ ప్రభుత్వం ఏర్పడి పది మాసాలు కావస్తున్నా సాదాబైనామాల ఊసే ఎత్తకపోవడంతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది.

12 క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు



సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ జలాశయం వద్ద 12 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి 1,78,865 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 1,37,809 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 (312 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 588.50 (307.5790 టీఎంసీలు) అడుగులుగా ఉంది. 12 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 95,316 క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 29,354 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమకాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 588.50 అడుగులుండగా నీటి నిల్వలున్నాయి.

విద్యాభ్యున్నతికి ట్రస్మా ఐక్యత అవసరం

మిర్యాలగూడ టౌన్ : విద్యాభ్యున్నతికి ట్రస్మా ఐక్యత ఎంతో అవసరమని, ఉపాధ్యాయులు కూడా కాలానికి అనుగుణంగా మారాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మధుసూదన్, రమేష్‌రావు, కోశాధికారి పి.రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మిర్యాలగూడలో నిర్వహించిన ట్రస్మా జిల్లా, డివిజన్, మండల, పట్టణ వ్యవహర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర విద్యారంగంలో ప్రైవేట్ విద్యా సంస్థల పాత్ర ఎంతో ఉన్నతమైనదన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు ఎం.రామ్మోహన్ అధ్యతన జరిగిన సమావేశంలో గాదె రవీందర్‌రెడ్డి, రాములు, వంగాల నిరంజన్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో ఆయన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. దాదాపు 40 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూ, ఫైనాన్స్ సంబంధిత సమస్యలు ఉంటే చట్టపరంగా చూసుకోవాలని చెప్పారు.

హోంగార్డు కుటుంబాలకు భరోసా

26 మంది హోంగార్డ్‌ల పిల్లలు.. చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్కాలర్‌షిప్‌లు, వివాహాలకు ఆర్థిక సాయం, మెడికల్ రీయింబర్స్‌మెంట్, విధుల్లో మరణించిన హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ ఆర్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని 'పాలేరు' బ్యాక్ వాటర్ ప్రవాహం

- సాగర్ ఎడమ కాల్వ కట్ట తెగిన చోట్లలో తగ్గని వరద
- ఇంకా నీటిలోనే పొలాలు..
- ఆందోళనలో కాగితరామచంద్రాపురం రైతులు



కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వ కట్ట తెగిన చోట నుంచి పోతున్న పాలేరు బ్యాక్ వాటర్

నడిగూడెం: నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపాన 132, 133 కిలోమీటర్ల వద్ద ఈనెల 1న నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండుచోట్ల తెగిన విషయం విదితమే. దీంతో నాగార్జున సాగర్ నుంచి ఎడమ కాల్వకు నీటిని నిలిపివేయగా అటువైపు నుంచి నీటి ప్రవాహం తగ్గింది. కానీ, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ప్రవాహం మాత్రం ఆగడం లేదు. దీంతో ఎడమ కాల్వకట్ట తెగిన చోట్ల నుంచి వరద ప్రవాహం కాగితరామచంద్రాపురం రైతుల పొలాల మీదుగా పారుతూనే ఉంది. ఫలితంగా రైతుల పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. కొన్ని పొలాల్లో ఇసుక మేట వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదిలా ఉండగా కాల్వకట్ట తెగిన చోట్ల మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేసినప్పటికీ ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తికాలేదని అధికారులు అంటున్నారు. టెండర్ పూర్తయి మరమ్మతు పనులు ప్రారంభించే సరికి వారం రోజులు పట్టవచ్చని, ప్రారంభించిన పనులు పూర్తి కావడానికి మరో 10 రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. రోజులు గడిచే కొద్దీ నాట్లు పెట్టిన పొలాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ కట్ట తెగిన చోట్లలో త్వరగా మరమ్మతులు పూర్తిచేసి అనంతరం నీటి విడుదలను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

తెలంగాణ కోసం త్యాగం చేసిన కాళోజీ



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్

నల్లగొండ : ప్రజాకవి కాళోజీ నారాయణరావు తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేశారని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన తెలంగాణరాష్ట్ర భాషా దినోత్సవం సందర్భంగా నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ తన రచనల ద్వారా ప్రజల్లో రాజకీయ, సాంఘిక చైతన్య స్ఫూర్తిని రగిలించారని తెలిపారు. 1969 ప్రత్యేక తెలంగాణ, గ్రంథాలయ, స్వాతంత్ర్య, సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొన్న మహనీయుడు అని కొనియాడారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా పనిచేసి నిజాం నిరంకుశ పరిస్థితులను ఎండగట్టిన ధీరుడన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచవద్దని.. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆ విషయాన్ని ఫిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.

వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టాలి

ప్రత్యేక అధికారులు ప్రతి మంగళవారం ఒక గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్యం, తాగునీటి వసతి కల్పన, సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో కమిషనర్లు పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు, రక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టేలా, జిల్లా అధికారులు కొన్ని వార్డులను తనిఖీ చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రను ఆదేశించారు. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎఫ్‌ఓ రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజలక్ష్మి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చైతన్యస్ఫూర్తి కాళోజీ

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ టూటౌన్: తన సాహిత్యంతో తెలంగాణ జాతిని చైతన్యపరిచిన గొప్ప కవి కాళోజీ నారాయణరావు అని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మహాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా ప్రశ్నించే తత్వాన్ని నేర్పించిన ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కంచనపల్లి రవీందర్‌రావు, కరీంపాషా, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, మారగోని గణేష్, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రీ, గున్‌రెడ్డి యుగంధర్ రెడ్డి, రంజిత్, రావుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్రోహులకు చెంపపెట్టులా హైకోర్టు తీర్పు

ఒక పార్టీలో శాసనసభ్యులుగా గెలిచి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన ద్రోహులకు చెంపపెట్టులా హైకోర్టు తీర్పు ఉందని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోమీడియాతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ప్రజాస్వామ్యంపై నమ్మకం పెరిగేలా తీర్పు ఉందని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. గురుదక్షిణ సమర్పించుకునేందుకు హైడ్రా పేరుతో రాజకీయం చేస్తున్నారని పరోక్షంగా ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చట్ట ప్రకారం కాకుండా రాజకీయాలు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడా బాబుల విషయంలో ఒకలా, పేదల విషయంలో మరోలా వ్యవహరిస్తోందన్నారు.

అర్హత ఉన్నా.. రుణమాఫీకి దూరం!

- సకాలంలో రెన్యువల్ చేసుకున్న రైతులకు వర్తించని మాఫీ
- మునుగోడు కెనరా బ్యాంకులో విచిత్ర పరిస్థితి
- అధికారులకు నివేదించామంటున్న బ్యాంకు సిబ్బంది
- ఎదురుచూపుల్లో 300 మంది రైతులు



మునుగోడులోని కెనరా బ్యాంకు

మునుగోడు: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని' చందంగా ఉంది కొందరు రైతుల పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలలోపు వారికి రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. కానీ, కెనరా బ్యాంకు నియమ, నిబంధనల కారణంగా అర్హత ఉన్నా చాలా మంది రైతులకు రుణమాఫీ అందలేదు. మాకు రుణమాఫీ ఎందుకు వర్తించడం లేదని ఇటూ బ్యాంకు అధికారులను, అటూ వ్యవసాయ అధికారులని ప్రశ్నిస్తున్నారు. తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడమే తామకు శాపంగా మారిందని వాపోతున్నారు.

రుణమాఫీ అందకపోవడానికి కారణం ఇది..

కెనరా బ్యాంకులో పంట రుణాలు పొందిన రైతులకు రుణం తీసుకున్న తేదీని మార్చడంలేదు. ఐదేళ్లపాటు అదే తేదీని కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల తర్వాత తేదీని మార్చి కొత్తగా రుణం మంజూరు చేసినట్లు నమోదు చేస్తున్నారు. ఈ పద్ధతి వల్ల చాలా మంది రైతులు రుణమాఫీ పొందలేకపోయారు. ఈ బ్యాంకు నుంచి రుణం పొందిన రైతులు నుంచి అసలు, వడ్డీ వసూలు చెల్లించి రుణాన్ని రెన్యువల్ చేసుకున్నా.. ఆ రైతులు మొదటిసారి రుణం తీసుకున్నదే తేదీనే కొనసాగుతుంది. అయితే ప్రభుత్వం 12.12.2018 నుంచి 09.12.2013 లోపు తీసుకున్న రుణాలనే మాఫీ చేస్తామని ప్రకటించింది. దీంతో కొందరు రైతులు 12.12.2018 కంటే ముందు రుణాలు తీసుకున్నా.. ఆ తర్వాత క్రమం తప్పకుండా అసలు, వడ్డీ చెల్లించి తిరిగి రుణం పొందినా.. బ్యాంకులో తేదీ మార్చకపోవడంతో ఆ రైతులకు రుణమాఫీ అందలేదు. వీరితో పాటు మరి కొంతమంది రైతులు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన తర్వాత కూడా రుణాలు చెల్లించారు. అయితే వారికి ఐదేళ్లు పూర్తి కావడంతో వారికి కూడా కొత్తగా రుణం ఇచ్చినట్లు నమోదు చేయడంతో రుణమాఫీ అందలేదు. కెనరా బ్యాంకులో గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ సమయంలో కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. బ్యాంకు అధికారుల తప్పిదాలు శాపంగా మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మూడు వేల మందికే రుణమాఫీ..

మునుగోడు మండలంలో 15 వేలకు పైగా రైతులు ఉండగా.. వారిలో దాదాపు 6 వేల మంది రైతులు మునుగోడు కెనరా బ్యాంకులో రుణాలు పొందారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షలలోపు రుణమాఫీ 3 వేల మంది రైతులకే వర్తించింది. రుణమాఫీకి అన్ని అర్హతలు కలిగిన 220 మంది రైతులకు 2018 డిసెంబర్ మాసం కంటే ముందే రుణం తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో వారికి రుణమాఫీ కాలేదు. అంతే కాకుండా 2024 జనవరి మాసం నుంచి జూన్ వరకు రుణాలు చెల్లించిన మరో 80 మంది రైతులకు కూడా రుణమాఫీ వర్తించలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని తమకు రుణమాఫీ అందేలా చూడాలని అర్హులైన రైతులు కోరుతున్నారు.

రెన్యువల్ చేయడంతో మాఫీ కాలేదు



నాకున్న 26 గుంటల భూమిపై మునుగోడు కెనరా బ్యాంకు 2019లో రూ.24 వేల రుణం తీసుకున్నా. దాన్ని ప్రతిఏటా రెన్యువల్ చేస్తున్నా. 2023 ఏప్రిల్‌లో రూ.26 వేల రుణం ఇచ్చారు. 2024లో బ్యాంకు అధికారులు రుణం చెల్లించాలని ఒత్తిడి చేయడంతో డబ్బు కట్టాను. అప్పుడు నా రుణఖాతా నంబర్ మారడంతో నా పేరు రుణమాఫీ లిస్టులో వచ్చినా పాత ఖాతా నంబర్ లేక మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

– మునుగోటి యాదయ్య, రైతు మునుగోడు

సరైన సమాధానం చెప్పడం లేదు



నాకున్న 4.20 ఎకరాల భూమిపై మునుగోడు కెనరా బ్యాంకులో మొదటిసారి 2018 అక్టోబర్‌లో రూ.1.30 లక్షల రుణం తీసుకున్నా. ఆ రుణాన్ని ఏటా అసలు, వడ్డీతో సహా చెల్లిస్తున్నా. 2021లో బ్యాంకు అధికారులు మరో రూ.20 వేలు పెంచి మొత్తం రూ.1.50 లక్షల రుణం ఇచ్చారు. కానీ నాకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తించలేదు. ఇదేమిటని బ్యాంకు, వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదు.

– పాల్వాయి యాదగిరిరెడ్డి, రైతు మునుగోడు

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మా బ్యాంకులో రుణ ఖాతాలకు సంబంధించిన తేదీలు ఐదేళ్లకోసారి మారుతాయి. రైతు రుణం తీసుకున్న తేదీ నుంచి ఐదేళ్ల వరకు ఆ రైతు వడ్డీ, అసలు చెల్లించినా పాత తేదీ మీదనే రుణం రెన్యువల్ చేస్తాం. దీని కారణంగా ఏటా రెన్యువల్ చేసినా 220 మందికి రుణమాఫీ వర్తించలేదు. 2024లో రుణాలు చెల్లించిన మరి కొంతమంది కూడా రుణమాఫీ రాలేదు. ఈ విషయాన్ని మా బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ప్రవీణ్, కెనరా బ్యాంకు మేనేజర్, మునుగోడు

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నాగేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పోచంపల్లి మండల శివారులోని అటవీ ప్రాంతంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రావుల నాగేశ్(32) టాటా ఏస్ వాహనాన్ని నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో కుటుంబ కలహాలు కూడా మొదలయ్యాయి. తీవ్ర మనస్తాపం చెందిన నాగేశ్ సోమవారం ఉదయం తన టాటా ఏస్ వాహనం తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తాను ఉన్న లోకేషన్ వీడియో తీసి భార్య ధనలక్ష్మి వాట్సప్‌లో పంపించాడు. ఆందోళన చెందిన ఆమె భర్తకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయదు. వెంటనే ధనలక్ష్మి తన అన్నలకు సమాచారం ఇవ్వడంతో వారు లోకేషన్ ఆధారంగా వెతుక్కుంటూ వెళ్లగా.. పోచంపల్లి–కొత్తగూడెం మార్గమధ్యలో మెయిన్‌రోడ్డు పక్కన టాటా ఏస్ వాహనం నిలిపి ఉంది. సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా నాగేశ్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచానామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కట్టంగూర్: కట్టంగూర్ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన గండమల్ల మధు (25) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. చిట్యాలలోని ఆఫీస్‌కు వెళ్లేందుకు ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో కట్టంగూర్ శివారులో ఎస్ఎల్‌బీసీ కాలువ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మధు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్. శ్రీను తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

మఠంపల్లి: మండలంలోని కొత్తదొనబండ తండాలో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి మఠంపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామాంజనేయులు మాట్లాడుతూ కొత్తదొనబండతండాకు చెందిన భూక్యా శ్రీను అక్రమంగా సేకరించి నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని తగిన సమాచారంతో దాడులుచేసి పట్టుకుని సీజ్‌చేశామని పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బొలేరో వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం

- ఇద్దరు మృతి
- బొత్తలపాలెం శివారులో ఘటన
- పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనే లోపే కబళించిన మృత్యువు



ప్రమాదంలో దెబ్బతిన్న బొలేరో



రిజ్వాన్ (ఫైల్)



ఆదిత్య (ఫైల్)

మిర్యాలగూడ: పది నిమిషాల్లో పని పూర్తిచేసుకుని ఇంటికి వెళ్లాలని అనుకుంటున్న తరుణంలోనే మృత్యువు వారిని కబళించింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామ శివారులోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలపాలెంలో రహదారి వెంట టాటా కేబుల్ నెట్‌వర్క్ తీగలు తెగడంతో మరమ్మతులు చేపట్టేందుకు దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన పంబాల ఆదిత్య (21), దేవరకొండకు చెందిన మహమ్మద్ రిజ్వాన్ (31), ఎర్ర జాషువా, కిరణ్ కలిసి బొలేరో వాహనంలో ఆదివారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. రెండు చోట్ల జాయింట్‌లు కలుపగా మూడవ ప్రాంతం వద్దకు వచ్చేసరికి ఆదివారం తెల్లవారుజాము అయ్యింది. రహదారి పక్కనే బొలేరో వాహనాన్ని నిలిపి కేబుల్ జాయింట్ చేస్తున్న క్రమంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న డీసీఎం బొలేరోను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిత్య అక్కడికక్కడే మృతిచెందగా రిజ్వాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బొలేరో వాహనంలో ఉన్న జాషువా, కిరణ్‌లకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పజెప్పారు. మృతుడు ఆదిత్య తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. రిజ్వాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదిత్య అవివాహితుడు.

నాన్న రాక కోసం చిన్నారుల ఎదురుచూపు..

రిజ్వాన్ ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులకు ఫోన్ చేసి రేపు ఉదయం 9గంటల కల్లా ఇంటికి వచ్చి పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్తానని చెప్పినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నాన్న ఇంటికి వస్తాడు.. మమ్మల్ని స్కూల్‌కు తీసుకెళ్తారని ఎదురుచూసిన చిన్నారులకు తమ తండ్రి తిరిగి రాని లోకాలకు వెళ్లాడని తెలియక ఏరియా ఆస్పత్రిలో దీనంగా ఎదురు చూస్తూ కూర్చున్నరాఉ. తల్లి, ఇతర కుటుంబసభ్యులు రోదిస్తుండగా 'అమ్మా.. నాన్న ఎక్కడ' అంటూ పిల్లలు అడిగిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. రిజ్వాన్ తండ్రి రెండేండ్ల క్రితం మృతిచెందగా రిజ్వాన్ టాటా సంస్థలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అతడి మృతితో కుటుంబం వీధిన పడింది. రిజ్వాన్ మృతితో దేవరకొండలోని ఇస్లాంపురలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆసరాగా ఉంటాడనుకుంటే..

చేతికొచ్చిన కొడుకు తమ కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న సమయంలోనే విధి వక్రీకరించి ఆ కుటుంబంలో విషాదం నింపింది. పంబాల ఆదిత్య మృతితో ఆ కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. ఇంటర్ వరకు చదివిన ఆదిత్య కుటుంబ పోషణ కోసం ఆరు నెలల క్రితం టాటా కేబుల్స్‌లో పనిలో చేరాడు. రోజుమాదిరిగానే ఆదివారం కూడా పనినిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకుండా పోయాడు. ఆదిత్య మృతితో కొండభీమనపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. చేతికందిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

క్వారీ గుంతలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఆత్మకూర్ (ఎస్): మండలంలోని బొప్పారం సమీపంలో క్వారీ గుంతలో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. బొప్పారం సమీపంలోని క్వారీ గుంతలో నీటిని వాడుకోవడానికి మోతె మండలం కూడలితండాకు చెందిన భూక్య బిచ్చా విద్యుత్ మోటారు బిగించాడు. ఇటీవలి వర్షాలకు క్వారీలోకి భారీగా నీరు చేరడంతో మోటారు మునిగిపోయింది. దానిని తీసేందుకు అదే తండాకు చెందిన హీరా(51)ను కూలికి తీసుకొచ్చాడు. శనివారం మోటారు బయటకు తీసే క్రమంలో హీరా నీటిలో మునిగిపోయి బయటికి రాలేదు. ఆ రోజు నుంచి ఆదివారం రాత్రి వరకు పోలీసులు, స్థానికులు, గజ ఈతగాళ్లు, సీసీ కెమెరాలతో పాటు ఫైర్ సిబ్బంది వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హీరా మృతదేహం నీటిపై తేలగా స్థానికుల సహాయంతో పోలీసులు బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. హీరా కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులుగౌడ్ తెలిపారు.

ఏఎమ్మార్పీ కాలువలో..

పెద్దఅడిశర్లపల్లి: చేపల వేటకు వెళ్లి ఏఎమ్మార్పీ కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. దేవరకొండ పట్టణానికి చెందిన మహ్మద్ జుబైర్ (47) తన స్నేహితుడు హారిఫ్‌తో కలిసి ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఏకేబీఆర్) ప్రధాన గేటు వద్ద గల కాలువలో గాలం వేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న హారిఫ్ పోలీసులకు సమాచారం అందించగా గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని ఏఎమ్మార్పీ అధికారులతో మాట్లాడి ఏకేబీఆర్ ప్రధాన గేట్లను మూసివేయించి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలం మాధవరెడ్డికాలనీ సమీపంలో కాలువలో జుబైర్ మృతదేహం లభ్యమైంది. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ వైరు చోరీ

తిప్పర్తి: మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన సుంకరబోయిన రాములు బుషిరెడ్డిగూడెం శివారులోని తన వ్యవసాయ బావి వద్ద ఈ నెల 1వ తేదీన ఐదు స్తంభాలకు విద్యుత్ వైరు ఏర్పాటు చేయించాడు. మరుసటి రోజు వెళ్లి చూడగా స్తంభాలకు ఉన్న 200మీటర్ల వైరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధిత రైతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఏఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

విద్యార్థుల సేవాదృక్పథం అభినందనీయం



సూర్యాపేట కలెక్టర్‌కు చెక్కులు అందజేస్తున్న విద్యార్థులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- వరద బాధితులకు రూ.2.50 లక్షలు అందించిన ఎంఎస్‌ఆర్ విద్యార్థులు

భానుపురి (సూర్యాపేట): చిన్న వయసులోనే విద్యార్థులు సేవా దృక్పథం, సామాజిక బాధ్యత కలిగి ఉండడం అభినందనీయమని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి సేకరించిన డబ్బులను జిల్లాలో వరద బాధితులను అందించేందుకు ఎంఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ముందుకొచ్చారు. ఎంఎస్‌ఆర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు రూ.1, 50,116లు, ఎంఎస్‌ఆర్ సెంట్రల్ స్కూల్ దురాజ్‌పల్లి విద్యార్థులు 1,00,116 కలిపి సేకరించిన మొత్తం రూ.2,50,232లను వేర్వేరుగా చెక్కుల రూపంలో సోమవారం విద్యాసంస్థల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్, డైరెక్టర్ బి.ప్రభాకర్, ప్రిన్సిపాళ్లు ఉమా, శ్రీలక్ష్మీ కలిసి విద్యార్థుల చేతుల మీదుగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథాన్ని భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి డీఆర్డీఓ వీవీ.అప్పారావు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, సీపీఓ ఎల్.కిషన్, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మోటారుసైకిల్ ఢీకొని మహిళ మృతి



గోపమ్మ (ఫైల్)

భువనగిరి రూరల్: రోడ్డు దాటుతున్న మహిళను మోటారుసైకిల్ ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటన భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెవారిపంపు గ్రామానికి చెందిన గంగదేవి గోపమ్మ(62) సోమవారం భువనగిరికి వెళ్లేందుకు మన్నెవారిపంపు గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు వెళ్తున్న మోటారుసైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

బ్యాటరీ చోరీకి యత్నం

మర్రిగూడ: గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి జనరేటర్‌కు సంబంధించిన బ్యాటరీ చోరీకి ప్రయత్నించారు. ఈ ఘటన మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం శివారులో చోటుచేసుకుంది. మర్రిగూడ స్టేషన్ ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివన్నగూడెం గ్రామ శివారులో ఎయిర్‌టెల్ టవర్‌లో గల జనరేటర్‌కు సంబంధించిన బ్యా టరీని దొంగలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించి పారిపోయారు. గ్రామానికి చెందిన పిట్టల పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీకొని తీవ్ర గాయాలు

త్రిపురారం: నిడమనూరు మండల కేంద్రంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన భీమయ్య(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం స్థానికంగా నవ్య బుక్ స్టాల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా.. మిర్యాలగూడ నుంచి హాలియా వైపు వెళ్తున్న డీసీఎం భీమయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో గ్రామస్తులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్ తరలించారు. బాధితుడి అన్న దండుగుల సరస్వతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నిడమనూరు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రైతుల పేరిట రూ.20లక్షలు స్వాహా!

- బేతవోలు పీఏసీఎస్‌లో వెలుగులోకి వచ్చిన కుంభకోణం
- అధికారులు, సిబ్బందే లోన్లు తీసుకున్నట్లు ఆరోపిస్తున్న రైతులు
- రుణమాఫీ కాకపోవడంతో బయటపడిన వ్యవహారం

చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన హుస్సేన్ బేతవోలు ఎస్‌బీహెచ్‌లో రూ.లక్ష లోన్ తీసుకున్నాడు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రుణమాఫీ లిస్ట్‌లో ఇతడి పేరు రాలేదు. బ్యాంక్ దగ్గరకు వెళ్తే.. 'నీ పేరు పంపించాం, రూ.లక్ష రుణమాఫీ జాబితాలో నీ పేరు రాలేదంటే వ్యవసాయాధికారులను కలవండి' అని చెప్పారు. దీంతో మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులను కలిశాడు. వారు అతడి ఆధార్‌కార్డు నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి చూడగా.. అతడు బేతవోలు ఎస్‌బీహెచ్‌లో రూ.లక్ష, బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.లక్ష రుణం తీసుకున్నట్లు ఉంది. దీంతో హుస్సేన్ కంగుతిన్నాడు. తాను బేతవోలు పీఏసీఎస్‌లో అసలు రుణమే తీసుకోలేదని పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చి అధికారులను, పీఏసీఎస్ చైర్మన్ నిలదీశాడు.



బేతవోలు పీఏసీఎస్ కార్యాలయం

చిలుకూరు: మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో భారీ కుంభకోణం బయటపడింది. రైతులకు తెలియకుండా రైతుల పేరుతో అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది క్రాప్ లోన్లు తీసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బేతవోలు పీఏసీఎస్ పరిధిలో చిలుకూరు మండలంలోని బేతవోలు, జెర్రిపోతులగూడెం, కొమ్ముబండతండా, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, కొండాపురం, పోలేనిగూడెం, సీతరాంతండా గ్రామాలు ఉన్నాయి. ఆయ గ్రామాల పరిధిలోని 3వేల మందికి పైగా రైతులు ఈ పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్నారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ప్రతి ఏడాది క్రాప్ లోన్లు, దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తారు. రైతులకు ఎరువులు కూడా అందజేస్తారు. సంఘం లావాదేవీలపై ప్రతి ఏడాది మార్చి నెలలో ఆడిట్ జరుగుతుంది.

2021 మార్చి ఆడిట్‌లో తప్పుడు పేర్లు...

2001లో ఆడిట్ జరిగే సమయంలో ఆ ఏడాది ఎరువులు అమ్మిన డబ్బులను సంఘంలో జమ చేయకుండా సంఘంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సొంత అవసరాలకు రూ.15 లక్షలకు పైగా వాడుకున్నట్లు తెలిసింది. అయితే ఆడిట్ జమ, ఖర్చుల తేడా రాకుండా ఉండేందుకు తమ బంధువులు, తెలిసిన వాళ్లకు క్రాప్ లోన్లు ఇచ్చినట్లుగా పేర్లు రాసి డబ్బులు ఇచ్చినట్లుగా చూపించారు. అ తర్వాత ఆడిట్‌లో జమ, ఖర్చులు సమానమయ్యే విధంగా లెక్కలు చూపించారు.

రుణమాఫీ కాకపోవడంతో..

ప్రభుత్వం ఇటీవల రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేయగా.. పలువురు రైతులకు రుణమాఫీ రాకపోవడంతో ఈ కుంభకోణం బయటపడింది. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారికి దగ్గరకు పోవడంతో వారు ఆన్‌లైన్‌లో చూసి మీకు బేతవోలు ఎస్‌బీహెచ్, బేతవోలు సొసైటీలో కలిపి రూ.2 లక్షలకు పైనే రుణం ఉన్నదని, అందుకే రుణమాఫీ రాలేదని చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. మరికొంత మంది రైతులు రుణం తీసుకోకున్నా రుణమాఫీ అయ్యింది. గతంలో కూడా కొంత మందికి ఇలాగే జరిగినట్లు సమాచారం. బేతవోలు పీఏసీఎస్ పరిధిలో ఇలాంటి బాధితులు 15మందికి పైగా ఉన్నారని, ఈ వ్యవహారంలో రూ.20లక్షల వరకు కుంభకోణం జరిగినట్లుగా తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపడితే ఈ కుంభకోణం పూర్తిగా వెలుగులోకి వస్తుందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మా దృష్టికి వచ్చింది

బేతవోలు పీఏసీఎస్ పరిధిలో పలువురు రైతులు రుణం తీసుకోకున్నా వారికి రుణం తీసుకున్నట్లు చూపిస్తోందనే విషయం మా దృష్టికి వచ్చింది. ఇదే విషయమై గత వారం రోజులుగా పీఏసీఎస్‌లో గొడవలు జరుగుతున్న మాట వాస్తవమే. 2021 మార్చిలో రైతులకు తెలియకుండా రైతుల పేరుతో రుణం తీసుకున్నట్లుగా పేర్లు రాశారు. రుణమాఫీ కాని రైతులు మా సొసైటీకు వచ్చి అడుగుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సీఈఓ, సిబ్బంది వాడుకున్న డబ్బులను వెంటనే జమ చేయాలని చెప్పాం.

– బజ్జూరి రవీందర్‌రెడ్డి, బేతవోలు పీఏసీఎస్ చైర్మన్

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక



అంజలి

గుర్రంపోడు: ఎన్ఎస్ఎస్ జాతీయ సమైఖ్యత శిబిరంలో పాల్గొనేందుకు గుర్రంపోడు మోడల్ స్కూల్ విద్యార్థి కటికర్ల అంజలి ఎంపికైంది. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అంజలిని ప్రిన్సిపాల్ ఎ. అపర్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్ సన్మానించి అభినందించారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో అంజలి పాల్గొని తెలంగాణ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

శాలిగౌరారం ప్రాజెక్టును పరిశీలించిన డీఈఈ



అలుగు వద్ద కొబ్బరికాయ కొడుతున్న నీటిపారుదలశాఖ డీఈఈ సత్యనారాయణ

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తుండడంతో నీటిపారుదల శాఖ డీఈఈ సత్యనారాయణ సోమవారం ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీరు, ప్రాజెక్టు నీటి సామర్థ్యం, ప్రాజెక్టు కట్ట, కుడి, ఎడమ కాల్వల ప్రధాన తూములు, అలుగును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్టు కుడి అలుగు ద్వారా నీరు బయటకు వెళ్తుండడంతో అలుగు పరిస్థితిని పరిశీలించి గంగమ్మతల్లికి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టును ప్రతిరోజు సందర్శించి పర్యవేక్షణ చేయాలని ఏఈకి సూచించారు. అదేవిధంగా వర్షాలు అధికంగా కురిసి ప్రాజెక్టుకు వరదనీటి ప్రవాహం పెరిగితే అందుకోసం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి వివరించారు. ఆయన వెంట ఏఈ రాములు, రైతులు చామల వెంకటరమణారెడ్డి, పడాల సత్తయ్య, ఉప్పరబోయిన శ్రీను, వడ్లకొండ దశరథలు ఉన్నారు.

పత్తిలో పురుగు నివారణ–యాజమాన్య పద్ధతులు



పెద్దవూరలో సాగవుతున్న పత్తి చేను

పెద్దవూర: రైతులు బీటీ పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించడానికి ఆస్కారం ఉంటుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచిస్తున్నారు. పత్తిలో పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

తక్కువ కాల పరిమితి గల విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తుకోవడం ద్వారా చాలా వరకు పురుగు ఉధృతిని అరికట్టవచ్చు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం, సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గుచూపడం, అధికారులు సిఫారసు చేసిన పురుగు మందులను వాడడం చేయాలి. ఇష్టారీతిగా పురుగు మందులు వాడకుండా తగినంత మోతాదులో వాడడం, పిచికారీ సమయంలో జాగ్రత్తలు పాటిస్తే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి పంట పూత దశలో ఉంది.

పూత దశలో పురుగులను అదుపు చేయడానికి..

తొలి దశలో ఆశించే పురుగులను అదుపు చేయడానికి కాండం మీద పూత పద్ధతిని పాటించాలి. 3 పర్యాయాలు 30, 45 రోజుల్లో మోనోక్రోటోఫాస్ 1:4 (ఒక భాగం మందు, 4 భాగాలు నీళ్లు) నిష్పత్తిలో వాడాలి. తిరిగి 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో (ఒక పాళ్ల మందు, 20 పాళ్ల నీరు) వాడాలి. కాండం, పూత పద్ధతి ద్వారా పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి పురుగులను ఎటువంటి పురుగు మందుల పిచికారీ లేకుండా 70–80 రోజుల వరకు అదుపు చేసుకోవచ్చు. మందులను పిచికారీ చేయకపోవడం వల్ల తొలిదశలో మిత్ర పురుగుల సంతతి పెరిగి చీడపీడలను అదుపు చేయడంలో సహకరిస్తాయి. రసం పీల్చు పురుగుల నివారణకు 5 శాతం వేప గింజల కషాయం వాడాలి.

కాయ తొలుచు పురుగు ఆశించే దశ..

60 నుంచి 90 రోజుల పంట దశలో పత్తి పైరులో సాధారణంగా పూత ఏర్పడిన దగ్గరి నుంచి కాయ తొలుచు పురుగులు ఆశించడం మొదలవుతుంది. తలనత్త, శనగ పచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగులు పంటను వివిధ దశల్లో ఆశించి తీవ్ర నష్టం కలిగిస్తాయి. ఎకరంలో 50 శాతం మొక్కల్లో కనీసం ఒక్కో మొక్కను ఒక గూడ కంటే ఎక్కువ నష్టపోతే (పురుగు చేసిన రంధ్రంతో విచ్చుకున్న గూడలు) 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేస్తే శనగపచ్చ పురుగు గుడ్లను, మొదటి దశ గొంగళి పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. బీటీ క్రిమి సంహారక మందులను బీటీ వంగడాలపై వాడకూడదు. వృక్ష మందులైన వేపగింజల కషాయం 5 శాతం లేదా 0.5 శాతం వేపనూనె లేదా 0.2 నుంచి 0.5 శాతం పిచికారీ చేయవచ్చు. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 1.0 మి.లీ. నోవల్యూరాన్ లేదా 1.0 మి.లీ. లూఫెన్యూరాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయోట్‌ను 0.5 మి.లీ. పిచికారీ చేయాలి.

పాడి-పంట

శనగపచ్చ పురుగు ఆశించు దశ

90 నుంచి 120 రోజుల దశలో శనగపచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. 90 రోజుల నుంచి బీటీ పత్తిలో గూడ, పిందెల్లో ఉండే బీటీ ప్రోటీన్ స్థాయి క్రమేపీ తగ్గుతూ ఉండడం వల్ల శనగపచ్చ పురుగుల నియంత్రణ తగ్గుతూ ఉంటుంది. ఈ దశలో ఏవైనా గొంగళి పురుగుల నష్టపరిమితి స్థాయి గమనిస్తే 1 లేదా 2 పర్యాయాలు క్రిమి సంహారక మందులు ఉపయోగించడం ద్వారా పురుగును అదుపు చేయవచ్చు. థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ. ను పిచికారీ చేయాలి. రెండోసారి పిచికారీగా సైపనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 1.0 మి.లీ. చొప్పున ఒక లీటరు నీటికి కలిపి ఏదో ఒక మందును మార్చి మార్చి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు సిఫార్సు చేసిన పురుగు మందులను 3 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2.0 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.03 గ్రా.ఫ్లోనికామిడ్ లేదా 1.25 గ్రాముల డైఫెనిథియురాన్ ఒక లీటరు నీటికి కలిపి వాడాలి.

గులాబీ రంగు, పిండినల్లి పురుగు

120 రోజుల తర్వాత దశలో గులాబీ రంగు పురుగు పిండినల్లి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. గులాబీ రంగు పురుగు నష్టపరిమితి స్థాయిని గమనించి పత్తి పంటలో అక్కడక్కడ కొన్ని కాయలను కోసి తెరిచి చూడాలి. పది కాయలకు ఒక లార్వా ఉంటే నష్ట పరిమితి స్థాయి అధిగవిఁచినట్లుగా గుర్తించాలి. అవసరం మేరకు పంట చివరి దశలో ఒకటి లేదా రెండు పర్యాయాలు సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పిచికారీ చేయడం ద్వారా పురుగును నివారించవచ్చు. పెద్ద గొంగళి పురుగులను ఏరి నాశనం చేయాలి. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ లేదా ప్రొఫెనోపాస్ మందులను వాడాలి. పంట విత్తిన వెంటనే 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించినట్లయితే ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను పెట్టాలి. బుట్టలో 8 తల్లి రెక్కలు పడినట్లయితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.